భద్రత కల్పించాలి



మహిళా డాక్టర్లు, సిబ్బంది అస్పత్రుల్లో ఎలాంటి రక్షణ లేని వాతావరణంలో పని చేస్తున్నారు.ఈ విషయం కోల్‌కతా ఘటనతో స్పష్టంగా తెలిసింది. అభద్రతా భావనలో పని చేయడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. మానసికంగా ఒత్తిడితో విధులపై దృష్టి సారించలేరు. ఈ పరిస్థితి నుంచి వైద్య సిబ్బంది బయటపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందికి రక్షణ కల్పించే దిశగా అందరూ ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ మాసీలామణి, విశ్రాంత డీఎంహెచ్‌ఓ

ధైర్యం కల్పించాలి



ప్రజల ప్రాణాలను కాపాడే వైద్య సిబ్బందిపై దాడులు దారుణం. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన అమానుషం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళా వైద్య సిబ్బంది భద్రతకు కఠిన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుని ధైర్యంగా విధులు నిర్వహించే పరిస్థితిని వైద్యసిబ్బందిలో కల్పించాలి.

–కామేశ్వరి, ఏఎన్‌ఎం, చేజర్ల

కఠిన చట్టాలు అవసరం



మహిళలపై జరిగే దాడులను అరికట్టేందుకు కఠిన చట్టాలు అవసరం. మహిళలపై దాడులకు పాల్పడే మృగాళ్లను శిక్షించేందుకు ఇప్పుడున్న చట్టాలు సరిపోవు. పాఠశాల, కళాశాల స్థాయి నుంచే మహిళలకు మానసిక ధైర్యంతో పాటు కరాటేను నేర్పించాలి. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దారుణం. దోషులను కఠినంగా శిక్షించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి.

– డాక్టర్ షేక్ మెహతాబ్, చేజర్ల పీహెచ్‌సీ



క్లుప్తంగా

ఎస్సై బాధ్యతల స్వీకరణ



హనీఫ్

పొదలకూరు: పొదలకూరు ఎస్సైగా ఎస్‌కే హనీఫ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడున్న డి.రామకృష్ణ వీఆర్‌కు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన హనీఫ్ విలేకరులతో మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించేది లేదన్నారు. పేకాట, గంజాయి రవాణా గురించి తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని కోరారు.

బహుమతుల ప్రదానం



పొదలకూరు: మండలంలోని అంకుపల్లి గ్రామంలో జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముగింపు కార్యక్రమానికి విచ్చేసి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మస్తాన్‌బాబు, మల్లికార్జున్ నాయుడు, భాస్కర్‌రెడ్డి, పిచ్చినాయుడు, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా ప్రతిజ్ఞ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఫిట్ ఇండియా ప్రతిజ్ఞను అధికారులు, క్రీడాకారులు ఉత్సాహంగా చేశారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్కే.యతిరాజ్, సెట్నల్ సీఈఓ వెంకటయ్య క్రీడా స్ఫూర్తిని ఉద్దేశించి మాట్లాడారు. క్రీడాదినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వారికి వంద మీటర్ల పరుగు, బ్రిస్క్ వాక్, చెస్, బ్యాడ్మింటన్, వాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 40 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వారికి 50 మీటర్ల పరుగు, 30 మీటర్ల వాక్, క్యారమ్స్, చెస్, బ్యాడ్మింటన్ పోటీలు, 60 ఏళ్లు పైబడిన వారికి 50 మీటర్ల వాక్, యోగా పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ అంశాలకు చెందిన క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

మైనింగ్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

నెల్లూరు (క్రైమ్): అక్రమ మైనింగ్‌పై గడిచిన మూడు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మైనింగ్ శాఖ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నెల్లూరు ఏసీబీ డీఎస్పీ శిరీషా నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు విజయకుమార్, ఆంజనేయరెడ్డి తమ సిబ్బందితో కలిసి నెల్లూరు ఆటోనగర్‌లోని మైనింగ్ డీడీ కార్యాలయంలో సోదాలు చేస్తున్నారు. సోమవారమూ సోదాలు కొనసాగాయి. జిల్లాలో ఎన్ని ఇసుక రీచ్‌లకు అనుమతులు ఉన్నాయి? ఎంత మేరకు తవ్వకాలు జరిగాయి? రవాణా తదితర శాఖలకు సంబంధించి మైనింగ్ అధికారుల నుంచి వివరాలు సేకరించడంతో పాటు క్షుణ్ణంగా ప్రతి ఫైల్‌ను పరిశీలిస్తున్నారు. మైనింగ్ అనుమతులు, తవ్వకాలు నిబంధనల మేరకు జరిగాయా తదితరాలకు సంబంధించిన ఫైల్స్‌ను సైతం పరిశీలిస్తున్నారు. సోదాల పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు ఏసీబీ అధికారులు పేర్కొంటున్నారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా

ముత్తుకూరు: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం నేత్రపర్వంగా జరిగాయి. ముత్తుకూరు, కృష్ణపట్నం, ఈపూరు, పాటూరువారికండ్రిగ, మల్లూరు తదితర గ్రామాల్లోని ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రత్యేక అభిషేకాలతో కృష్ణుడికి పూజలు చేశారు. వసంతోత్సవాలు, రుక్మిణి కల్యాణాలతో ఆలయాలు భక్తి పారవశ్యంతో మునిగిపోయాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోర్టులో..

అదానీ కృష్ణపట్నం పోర్టులో వేడుకలు జరిగాయి. పరిపాలన భవనంలో సంప్రదాయబద్ధంగా వేదపండితులు కృష్ణుడి విగ్రహానికి పూజలు ఆచరించారు. సీఈఓ జీజే రావు, అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, ఫైనాన్సర్ గుడివాడ శ్రీకాంత్, మృత్యుంజయరామ్, వెంకటేష్ భాస్కరన్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

- **పొదలకూరు:** పట్టణంలోని గీతామందిరంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. మహిళా భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పూజా కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం స్వామికి ఊయలసేవ ఏర్పాటు చేశారు.
- **మనుబోలు:** కృష్ణాష్టమి వేడుకలను సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు శ్రీకృష్ణ మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లోని వివిధ కూడళ్లలో చిన్నారులు ఉత్సాహంగా ఉట్టి కొట్టారు.

బుచ్చి పట్టణంలో...

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని గిరిజా హాల్ ప్రాంగణంలో కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి శ్రీకృష్ణ పరమాత్ముని ప్రతిమను అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, గీతా పారాయణం చదివి వినిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

- **ఇందుకూరుపేట :** కృష్ణాష్టమి పర్వదినాన్ని మండల వాసులు వేడుకగా నిర్వహించారు. ఈ క్రమంలో శ్రీకృష్ణుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ఇందుకూరుపేట, రావూరు, పున్నూరు, మైపాడు తదితర గ్రామాల్లోని శ్రీకృష్ణ మందిరాల్లో స్వామివారికి పంచామృత అభిషేకాలు విశేష పూజలు జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: గిరిజా హాల్ ప్రాంగణంలో..



గీతా మందిరంలోని శ్రీకృష్ణుడు



ముత్తుకూరు: ఈపూరులో చెన్నకేశవస్వామి ఊరేగింపు



ముత్తుకూరు: పూజలో పాల్గొన్న సీఈఓ జీజే రావు



మనుబోలు: ఉట్టి కొడుతున్న చిన్నారి



ఇందుకూరుపేట : ప్రత్యేకాలంకరణలో స్వామివారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొదలకూరు: మండలంలోని తోడేరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో అలయ్యగారిపాళెం, నందివాయ, తోడేరు వీవర్స్ కాలనీ గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్లో మరమ్మతులు చేపడుతున్నందున సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

నలుగురు జూదరుల అరెస్ట్

పొదలకూరు: మండలంలోని అమ్మవారిపాళెం గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం ఎస్సై హనీఫ్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి రూ.4,150 నగదు, మూడు సెల్‌ఫోన్లు, మూడు మోటార్‌బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

డీబీఎస్‌ఐపై ఉపాధ్యాయులకు శిక్షణ నేడు

కొడవలూరు : డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా(డీబీఎస్ఐ) ప్రాజెక్ట్‌పై కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాల ఉపాధ్యాయులకు మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ జి.వసంతకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం కొడవలూరు విద్యా వనరుల కేంద్రంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ శిక్షణకు పైమూడు మండలాల్లో పాఠశాలకు ఒక టీచర్ వంతున ఎంపిక చేశారని, వారు విధిగా హాజరు కావాలని సూచించారు.

పేకాట కేంద్రంపై దాడి

నెల్లూరు(క్రైమ్): బాలాజీ నగర్ గౌడ హాస్టల్ సమీపంలో ఇళ్ల మధ్యలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట కేంద్రంపై సోమవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. తొమ్మిది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. రూ.1,04,900 నగదును స్వాధీనం చేసుకున్నట్లు బాలాజీ నగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు వెల్లడించారు.

పొట్టేళ్ల వాగు ఆక్రమణల తొలగింపు

- కల్వర్టులు ఉంచాలని స్థానికుల విజ్ఞప్తి

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్ శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి సమీపంలో పొట్టేళ్ల వాగు ఆక్రమణల తొలగింపును సోమవారం ఇరిగేషన్ అధికారులు చేపట్టారు. ఈ వాగు ఆక్రమణలను సుమారు కిలోమీటరు మేరకు అంటే కేఆర్‌ఆర్ గార్డెన్స్ వరకు కొనసాగించడం జరుగుతుందని ఇరిగేషన్ ఏఈ అనిల్‌కుమార్ వెల్లడించారు. వాగు ఇరువైపులా ఆక్రమణలకు గురై లేఅవుట్ల యజమానులు కొంతమేర వాగు పోరంబోకు స్థలాన్ని కలిపేసుకున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో ఇటీవల మండల సర్వేయర్ సర్వే నిర్వహించి గుర్తులు పెట్టడంతో ఇరిగేషన్ అధికారులు యంత్రాల సాయంతో ఆక్రమణలను తొలగిస్తున్నారు. దేవస్థానం వద్ద దశాబ్దం క్రితం అటూ, ఇటూ జనాలు వెళ్లేందుకు రెండు కల్వర్టులను నిర్మించారు. వాటిని ఉంచాల్సిందిగా స్థానికులు కోరారు. నిత్యం రద్దీగా ఉండే లేఅవుట్ల రహదారులపై నిర్మించిన కల్వర్టులను యథావిధిగా ఉంచితే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందంటున్నారు. అయితే పరిస్థితిని బట్టి కల్వర్టులను ఉంచాలా? లేక తొలగించాలా? అనే నిర్ణయం తీసుకుంటామని ఏఈ వెల్లడించారు. సర్వే చేసిన విధంగా తాము వాగు ఆక్రమణలను తొలగిస్తున్నట్లు చెప్పారు.



పొట్టేళ్ల వాగును వెడల్పు చేస్తున్న దృశ్యం

నెల్లూరు జట్టు విజయం

కడప స్పోర్ట్స్: కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో నెల్లూరు జట్టు విజయం సాధించింది. 51 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మూడోరోజు సోమవారం బరిలోకి దిగిన నెల్లూరు జట్టు 67.5 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 323 పరుగులు చేసింది. జట్టులోని షేక్ బాజీ 55 పరుగులు, మాధవ్ 79 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లు కనిష్ 3, సాయిసూర్యతేజారెడ్డి 2 వికెట్లు తీశారు. కాగా తొలి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 259 పరుగులు చేయగా, నెల్లూరు జట్టు 174 పరుగులు చేసింది. కర్నూలు జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 237 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో నెల్లూరు జట్టు 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

విభిన్న ఆకృతుల్లో గణనాథులు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న గణనాథుని ప్రతిమలు




గణనాథుని శిరస్సుపై శివుడు

- తయారీలో పెరిగిన పోటీ
- జీఎస్టీ వల్ల పెరిగిన ధరలు
- కనిపించని మట్టి ప్రతిమలు

పొదలకూరు : మండల పరిధిలో విభిన్న ఆకృతుల్లో గణనాథుని ప్రతిమలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. ఏటాలాగే ఇప్పుడు కూడా వినాయక ప్రతిమలు ప్లాస్టాఫ్ ప్యారిస్‌తోనే తయారు చేస్తున్నారు. చూద్దామన్నా మట్టి వినాయకుని ప్రతిమలు కనిపించడం లేదు. పొదలకూరులో తయారు చేస్తున్న గణనాథుని విగ్రహాల అమ్మకాల్లో పోటీ పెరిగింది. తయారీదారులు గతంలో మాదిరిగా ఆదాయం ఉండడం లేదంటున్నారు. దీనితోడు వస్తు ఆధారిత పన్ను(జీఎస్టీ) ప్రతిమల తయారీ ముడిసరుకులకు వర్తించడంతో బొమ్మల తయారీ వ్యయం పెరిగి ప్రతిమల కొనుగోలు ధరలు పెరిగాయి. గ్రామగ్రామాన విఘ్నేశ్వరుని విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నందున బొమ్మలకు డిమాండ్ బాగా ఉంది. అయితే రాజస్థాన్ ప్రాంతం నుంచి పొదలకూరుకు వచ్చిన బొమ్మల తయారీదారుల వల్ల వ్యాపారంలో పోటీ పెరిగింది. ఆరుమాసాల పాటు తయారీదారులు కష్టించి పనిచేస్తే వినాయక చవితికి గ్రామాల్లో బొమ్మలను అందించగలరు. కొందరు ఉత్సవ కమిటీ సభ్యులు పండగ రెండు, మూడు మాసాలు ముందుగానే తమకు కావల్సిన బొమ్మ డిజైన్ను అందజేసినా తయారీదారులు తమ నైపుణ్యంతో విగ్రహాన్ని అందించే వెసులుబాటు కూడా ఉంది.

బొమ్మల తయారీలో పెరిగిన పోటీ

సెప్టెంబర్ 7న వినాయక చవితి పండగ నేపథ్యంలో బొమ్మల తయారీలో పోటీ పెరిగింది. పండగ సమీపిస్తున్నందున తయారీదారులు ప్రతిమల రూపకల్పనలో వేగం పెంచారు. అయితే గతంలో మాదిరిగా గిట్టుబాటు కావడం లేదని అంటున్నారు. ఈ ఏడాది రూ.10 లక్షల వరకు పెట్టుబడులు పెట్టిన తయారీదారులు అమ్మకాలు ఎలా ఉంటాయోనని యోచిస్తున్నారు. గ్రామాల నుంచి బొమ్మల కొనుగోలు కోసం యువకులు వస్తున్నారు.



విఘ్నేశ్వరునిపై శ్రీకృష్ణుడు

యథేచ్ఛగా గ్రావెల్ దోపిడీ



కొత్తవంగల్లులో గ్రావెల్ తవ్వుతున్న జేసీబీలు



గ్రావెల్‌ను బయటి ప్రాంతాలకు తరలిస్తున్న ట్రాక్టర్లు

- టీడీపీ నేత నిర్వాకం
- చోద్యం చూస్తున్న పోలీస్, రెవెన్యూ యంత్రాంగం

కొడవలూరు : ఓ టీడీపీ నేత ఎర్రమట్టిని యథేచ్ఛగా దోచేస్తున్నారు. అధికార పార్టీ నేత కావడంతో పోలీసు, రెవెన్యూ యంత్రాంగం చోద్యం చూస్తూ ఉండిపోతోంది. ఈ ఘటన మండలంలోని కొత్తవంగల్లులో చోటుచేసుకుంది. కొత్తవంగల్లు గ్రామానికి చెందిన టీడీపీ నేత చక్కా మదన్ గ్రామంలోని ఎర్రమట్టి నేలల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారం గ్రావెల్‌ను తవ్వేసి అమ్మేస్తున్నారు. టిప్పర్‌లలో తరలిస్తే అనుమానం వస్తుందన్న కారణంతో ట్రాక్టర్లలోనే గ్రావెల్ తరలిస్తూ కాసులు సంపాదిస్తున్నారు. కొత్తవంగల్లు గ్రామంలో పుష్కలంగా గ్రావెల్ నేలలున్నాయి. ఈ భూముల్లో మట్టి తవ్వేందుకు ప్రభుత్వం ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదు. కానీ అధికార పార్టీ నేతలకు ప్రభుత్వ అనుమతులతో సంబంధం లేదు. స్థానిక ఎమ్మెల్యే పేరు చెప్పి అధికారులను భయపెట్టి ఇష్టానుసారం గ్రావెల్ తవ్వేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ గ్రావెల్ రూ.800ల చొప్పున అమ్ముకుంటూ లబ్ధిపొందుతున్నారు. కేవలం పల్లంగా ఉన్న పొలాల్లో మట్టిని తీసి చదును చేసుకొంటున్నామని చెబుతూ ఎమ్మెల్యేను నమ్మ బలికిస్తూ అక్రమార్జనకు శ్రీకారం చుట్టారు. రోజుకు వందలాది ట్రాక్టర్‌లలో గ్రావెల్‌ను తరలిస్తూ రూ.లక్షలు సంపాదిస్తున్నారు. ఈ విషయం పోలీసు, రెవెన్యూ అధికారులకు తెలిసినప్పటికీ అధికార పార్టీ నేత కావడంతో చోద్యం చూస్తూ ఉండిపోతున్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

నెల్లూరు(అర్బన్) : స్థానిక కిసాన్‌నగర్‌లోని మల్లెతోట కాలనీలో జయభారత్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సాధారణ వైద్యసేవలతో పాటు కంటి వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శిబిరం ఇన్‌చార్జి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కంటి ఆపరేషన్లు అవసరమైన వారందరికీ జయ భారత్ ఆస్పత్రిలో ఉచితంగా చేస్తామన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ సౌమ్య, హాస్పిటల్ సిబ్బంది ఈశ్వరి, రాజేశ్వరి, ప్రమీలా, పెద్ద సంఖ్యలో పేషెంట్లు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సాకు ఘన నివాళి

నెల్లూరు(బృందావనం) : రైల్వేఫీడర్స్‌రోడ్డులోని లోన్‌స్టార్ చర్చిలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం హనోక్ మాట్లాడుతూ మదర్ థెరిస్సా జీవనం సర్వమానవాళికి మార్గదర్శకమన్నారు. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏర్పాటు చేయనున్నామన్నారు. అందులో భాగంగా కన్వీనర్లు నియామకం చేపట్టామన్నారు. కార్యక్రమంలో పీడబ్ల్యూఏ నేషనల్ కన్వీనర్ జయప్రకాష్, క్రైస్తవ సంఘం నేత కలివెల ఎలీషాకుమార్, పీడబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐఎస్ బెన్హర్‌బాబు, కూరపాటి విజయకుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఏసురత్నం, జిల్లా ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఎస్ రాజు, రమేష్, కోశాధికారి కిశోర్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి జాషువా తదితరులు పాల్గొన్నారు.



మదర్ థెరిస్సా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు